## క్లుప్తంగా

### విధుల్లో నిర్లక్ష్యం తగదు



చౌడుపల్లి సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

**చింతపల్లిరూరల్:** సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. మండలంలో చౌడుపల్లి సచివాలయ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్‌లను సందర్శించి వాహనాల్లో మాత్రమే డీజిల్, పెట్రోల్ వేయాలని, విడిగా ఖాళీ బాటిల్‌లో వేయవద్దని బంకు నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రుణాలు చెల్లించి రెన్యువల్ చేయించుకోండి

**అడ్డతీగల:** ఎల్లవరం సొసైటీలో అప్పులు తీసుకున్న రైతులు వడ్డీలను 15 రోజుల్లోగా చెల్లించి తక్కువ వడ్డీలోనికి రెన్యువల్ చేయించుకోవాలని సొసైటీ సీఈవో ఎ.మణిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలా చేయలేని పక్షంలో జులై 1 నుంచి అసలు, వడ్డీలతో చెల్లించాల్సి వస్తుందన్నారు. అప్పులు తీసుకున్న రైతులు సొసైటీకి వచ్చేటప్పుడు ఫోటో, ఆధార్‌కార్డు, 1బి అడంగల్ జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

### 48 మందికి వైద్య పరీక్షలు



వణకరాయిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ నాగార్జున

**రాజవొమ్మంగి:** మండలంలోని అమీనాబాద్ పంచాయతీలోని ఎ.వణకరాయి గ్రామంలో బుధవారం డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ఆయన చెప్పారు. అవసరమైన వారికి బీపీ, సుగర్ ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 డీఈఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, ఏఎన్‌ఎం మల్లేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ పెద్దిరాజు, ఆశ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

### రామరాజ్యం ఆశయ సాధనకు కృషి



రామరాజ్యం స్థూపం వద్ద నివాళులర్పించి నినాదాలు చేస్తున్న ఎంపీపీ రమేష్, సీపీఐ నేతలు

**కొయ్యూరు:** దివంగత సీపీఐ నాయకుడు బడుగు రామరాజ్యం ఎనిమిదో వర్ధంతిని బుధవారం కించవానిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజ్యం స్థూపం వద్ద ఎంపీపీ బడుగు రమేష్, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి బాలెపల్లి వెంకటరమణ , అల్లూరి జిల్లా కార్యదర్శి పాట్టిక సత్యనారాయణ, నేతలు గండెపల్లి నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, నానాజీ తదితరులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రామరాజ్యం గిరిజనుల కోసం అనేక న్యాయ పోరాటాలు చేశారన్నారు. ఆయన చేసిన పోరాటాల వల్ల నాడు గిరిజనులకు భూహక్కు పట్టాలు అందాయని గుర్తు చేశారు. రామరాజ్యం ఆయశ సాధనకు కృషి చేయాలని కోరారు.

### మోదమాంబకు కుంకుమ పూజలు



**మాడుగుల రూరల్:** వీరవల్లి అగ్రహారంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన మోదమాంబ అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలో అమ్మ వారి మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.



# ఏళ్ల నాటి కల.. సాకారమైన వేళ

- ప్రగతి పథంలో చెరకుంపాలెం
- శరవేగంగా అభివృద్ధి పనులు
- ఆనందంలో గ్రామస్తులు



చెరకుంపాలెంలో రూపుదిద్దుకున్న రక్షిత తాగునీటి పథకం





చెరకుంపాలంలో హెల్త్‌క్లినిక్ భవనం

**రాజవొమ్మంగి:** గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజవొమ్మంగి మండలంలో అన్ని గ్రామాల్లో కనీస అభివృద్ధి జరగలేదు. గ్రామాలకు మట్టి దారులు ఉండేవి..వర్షంపడితే చిత్తడిగా మారడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. డ్రైనేజీలు లేక వాడుకనీరు రహదారుల పైనే నిలిచిపోయేది. గ్రామాల్లో నీటి సదుపాయం లేక నానా అవస్థలు పడేవారు. తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలోని కొండకాలువలను ఆశ్రయించేవారు. కలుషిత నీటి వినియోగంతో రోగాల బారిన పడేవారు.. రాజవొమ్మంగి మండలంలోని సంజీవనగరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల కోసం నిర్మించిన గదుల్లో తరగతులు జరిగేవి.. నీటి సౌకర్యం లేక విద్యార్థులు అల్లాడిపోయేవారు.. సమస్యలు తాండవిస్తున్నా నాడు చంద్రబాబు ప్రభుత్వం, పాలకులు కనీసం పట్టించుకోలేదు. ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదు...గ్రామస్తులు దశాబ్దాలుగా సమస్యలతోనే సహవాసం చేశారు..అదంతా గతం.. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజవొమ్మంగి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామాల రూపురేఖలు మారాయి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. నాడు-నేడు ద్వారా లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి ప్రభుత్వ పాఠశాలలకు జీవం పోశారు..కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు మారాయి. ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ఫలితంగా ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయమంగా పెరుగుతోంది.

**అభివృద్ధి పనులు**

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పనులతో రాజవొమ్మంగి మండలం చెరకుంపాలెం (చెరువుకొమ్ముపాలెం) పంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తోంది. సంజీవనగరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రూ.38లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి.

పాఠశాల ప్రాంగణంలో రన్నింగ్ వాటర్ కోసం మోటారు ఏర్పాటు చేశారు. అదే విధంగా చెరకుంపాలెంలో రైతు భరోసా, హెల్త్ సెంటర్ భవనాలు సర్వాంగ సుందరంగా నిర్మించబడ్డాయి. రంపచోడవరం డివిజన్‌లోనే పేరుగన్న బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు ( స్పోర్ట్స్ స్కూల్‌కు) పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించడంతో పశువుల బెడద, రాత్రి వేళల్లో దొంగల బెడద తప్పింది. అటవీప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఈ పాఠశాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విషకీటకాలు, వన్యప్రాణుల నుంచి రక్షణ కొరవడగా ప్రస్తుతం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రహరీ నిర్మాణం పూర్తవడంతో పిల్లలు సురక్షితంగా చదువులమ్మ ఒడిలో ఆటపాటలతో చదువుకొంటున్నారు.





చెరకుంపాలెంలో రైతు భరోసా కేంద్రం భవనం

**కోట్లాది రూపాయల నిధులు**

చెరకుంపాలెం పంచాయతీలోని ఏడు గ్రామాల్లో గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి సంక్షేమం శరవేగంగా పరుగులు పెట్టింది. ఈ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏకంగా రూ.11,18కోట్లు ఖర్చు చేసింది. సుమారు 700 కుటుంబాలు, 1800 జనాభా గల ఈ పంచాయతీలో పలు గ్రామాలకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో నీటి కోసం అక్కచెల్లెమ్మలు కడవలు భుజాన పెట్టి కొండకాలువల్లోకి వెళ్లాల్సిన ఇబ్బంది తప్పింది. ఇంటింటికి కుళాయిల ఏర్పాటు కోసం చెరకుంపాలెంలో రూ. 9.73 లక్షలు, సంజీవనగరంలో రూ.9.23 లక్షలు, బోర్నగూడెంలో రూ. 10.48 లక్షలు, వెలగలపాలెం గ్రామానికి రూ. 9.65లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసి ఇంటింటికి తాగునీటిని అందిస్తోంది. నాడు-నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో చెరకుంపాలెం ఎంపీపీ పాఠశాలకు రూ. 13 లక్షలు, బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు 33 లక్షలు ఖర్చు చేశారు. రెండవ విడతలో సంజీవనగరం ఎంపీపీ పాఠశాలకు రూ. 38 లక్షలు, పాత వెలగలపాలెం ఎంపీపీ పాఠశాలకు 16 లక్షలు, కొత్త వెలగలపాలెం ఎంపీపీ పాఠశాలను 16 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చెరకుంపాలెం గ్రామంలో నభూతో నఃభవిష్యత్ అన్నట్లుగా రూ. రైతు భరోసా కేంద్రం రూ. 30లక్షలతో హెల్త్ క్లినిక్ భవనాలు రూపుదిద్దుకొన్నాయి. బోర్నగూడెంలో రూ.17 లక్షల వ్యయంతో విన్నూత్నంగా రక్షిత తాగునీటి పథకం నిర్మాణం పూర్తయ్యింది.

**గడపగడపకు అభివృద్ధి పరుగులు**

ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వంకూడా అమలు చేయన విధంగా పంచాయతీల వారీగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించి అభివృద్ధికి దారులు వేసింది. ఇందులో భాగంగా చెరకుంపాలెం పంచాయతీకు ప్రభుత్వం విడుదల చేసిన రూ. 40 లక్షల నిధులతో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు నిర్మిచడంతో కష్టాలు గట్టెక్కాయి. రవాణా సౌకర్యం మెరుగుపడడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీధిరోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఏళ్ల నాటి కల సాకారం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



వెలగలపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు

## వ్యసనాలకు దూరంగా ఉండాలి



జంగాలతోటలో యువతకు షటిల్, క్రికెట్ కిట్లను అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

**వై.రామవరం:** యువత వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలని జంగాలతోట గ్రామ యువతకు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగు కార్యక్రమంలో భాగంగా బుధవారం జంగాలతోటలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని యువతకు వాలీబాల్, క్రికెట్, షటిల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు, ప్రజలు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గిరిజన యువత కోసం పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తమ వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. యువత పెడతోవ పట్టకుండా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాల జోలికి పోవద్దన్నారు. యువత ఉన్నత విద్య అభ్యసించడంతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతీ ఒక్కరు చెడు వ్యసనాల జోలికి పోవద్దన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి బీసీజీ వ్యాక్సిన్



కూనవరం సీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్‌పై నిర్వహిస్తున్న సమావేశం

**కూనవరం:** క్షయవ్యాధి నివారణకు గురువారం నుంచి కూనవరం, కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని సబ్ సెంటర్లలలో బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాజీవ్ తెలిపారు. వైద్య సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన క్షయ వ్యాధి(టీబీ) నుంచి రక్షణ పొందవచ్చన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, సుగర్‌వ్యాధితో బాధపడేవారు, టీబీ వ్యాధిగ్రస్తులు, పొగతాగే వారు, బీఎంఐ 18 ఉన్నవారు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కూనవరం, కూటూరు పీహెచ్‌సీ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఈ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత

**చింతపల్లిరూరల్:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి భాద్యత అని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు.బుధవారం చింతపల్లిలో వారపు సంతలో ఆమె పర్యాటించి వ్యాపారస్తులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏజెన్సీలో వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాపారస్తులు వ్యాపార నిర్వహణ నిమిత్తం చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని, చెత్త కుండీల్లోనే వేసేలా చూడాలన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని లేని యెడల పంచాయతీ తరపున చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

**చింతూరు:** స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాల యజమానులంతా పారిశుధ్యం పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. పారిశుధ్య నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. దుకాణాల ముందు చెత్తను వేసేందుకు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, వినియోగదారులు బయట పడేయకుండా చూడాలని ఆయన సూచించారు. దుకాణాలు ముందు ఉన్న చెత్తను గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్లలో వేయాలన్నారు.

## మహిళా రైతులకు సన్మానం



గిరి మహిళ రైతులను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

**అరకులోయ రూరల్:** మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో రైతు సాధికార, సంజీవిని, వాసవ్ సంస్థల సంయుక్తంగా మంగళవారం ఘనంగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం వేడుకలను నిర్వహించారు. వ్యవసాయ విధనాలపై గిరి రైతులను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక పద్ధతులతో సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడులపై అవగాహన కల్పించారు. సంజీవిని సంస్థ డైరెక్టర్ దేవుళ్లు మాట్లాడుతూ మానవ మనుగడకు జీవ వైవిధ్యం ప్రధాన పాత్రపోషిస్తోందన్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగబడికి అధునాతన పద్ధతులు పాటించాలన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త ఉజ్వల మాట్లాడుతూ ప్రతి రైతులు కొత్త, నూతన పద్ధతులతో సాగు చేయడంతో మరింత దిగుబడులు సాధించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు గిరి మహిళా రైతులను సన్మానించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాస్కర్‌రావు, ప్రకాష్ కళ్యాణి, మన్మథరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిల్లో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

**మాడుగుల రూరల్:** సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ సమన్వయకర్తలు ప్రకాష్, హేమసుందర్ తెలిపారు. బుధవారం ముకుందపురంలో నవధాన్యాలు నేలతల్లి బాగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 4,150 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 18 నుంచి 30 రకాల నవధాన్యాల విత్తనాలు పొలాల్లో జల్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వీటిని 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నాలని వివరించారు. ఈ విధంగా చేయడం వల్ల భూమిలో కర్బన శాతం, సూక్ష్మజీవులు పెరుగుతాయన్నారు. తద్వారా మొక్కలకు కావల్సిన అన్ని రకాలు పోషకాలు భూమికి అందుతాయన్నారు. పంటలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తొలుత బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు, సిబ్బంది నాగమణి, గోవిందమ్మ, నాగేశ్వరరావు, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట ఉత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

**అనకాపల్లి:** స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు, శాంతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో అవస్థలు

**పెదబయలు:** మండలంలో వంట గ్యాస్ కొరత వెంటాడుతోంది. పెదబయలు మండలంలోని వినియోగదారులకు భారత్ గ్యాస్ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా విక్రయిస్తోంది. మండలంలోని 23 పంచాయతీల పరిధిలోని వినియోగదారులకు గ్యాస్ నిత్యం అందించాల్సి ఉంది. అయితే గత నెల 30 తేదీ నాటికి స్థానిక గొడౌన్‌లో గ్యాస్ నిల్వలు పూర్తయ్యాయి. అప్పటి నుంచి నేటి వరకు గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో కొంతమంది ముంచంగిపుట్టు, అరకు ప్రాంతాల నుంచి కొనుగోలు ప్రయివేటు వాహనదారుల నుంచి రూ.1000 నుంచి రూ.1200 వరకు అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని, మూడు వారాలు గడిచినా సిలిండర్ల సరఫరా జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈవిషయంపై పెదబయలు జీసీసీ గొడౌన్ మేనేజర్ ఓ.గాసీ, గ్యాస్ గొడౌన్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా గత నెల 29 తేదీన గ్యాస్ లోడ్ కోసం బ్యాంకులో డీడీ తీయడం జరిగిందని, అయితే బ్యాంకు ఖాతా ఫ్రీజింగ్‌లో ఉండడం వల్ల జాప్యం జరిగిందన్నారు. ఈ కారణంగా పెదబయలు స్టేట్ బ్యాంకు నుంచి పాడేరు యూనియన్ బ్యాంకులో ఖాతా మార్పు చేశామన్నారు. మరో రెండు రోజుల్లో గ్యాస్ సిలిండర్ల స్టాక్ వస్తుందని చెప్పారు. అప్పటి వరకు అత్యవసరంగా గ్యాస్ సిలిండర్లు కావల్సిన వారికి వేరే ప్రాంతాల నుంచి సిలిండర్ల తీసుకొచ్చి సరఫరా చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆర్బీకేల్లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీబీ రంగాచారి

**అనకాపల్లి:** వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పీబీ రంగాచారి తెలిపారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో వ్యవసాయ సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి వారికి కావాల్సిన విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు. రూ.880 విలువ చేసే పది కిలోల జనుము, జీలుగ విత్తనాల బ్యాగ్‌లను రాయితీగా రూ.440కే అందిస్తున్నామన్నారు. రూ.1,072 విలువైన పిల్లిపెసర విత్తనాలు రూ.536 చెల్లించి కొనుగోలు చేయవచ్చన్నారు. ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎం.శ్రీనివాసరావు, ఎంపీఈవో జానకి, సచివాలయం వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

**మాకవరపాలెం:** వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బస్టాండు పక్కనే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించి గురువారం నాటికి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

### నేడు ముత్యాలమ్మ పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**పరవాడ:** పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు స్థానికుల పూజలను అందుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు తరలివస్తారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరవాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి తప్పెటగుళ్లు, డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## జీవవైవిధ్యంతోనే మానవాళి మనుగడ

**విశాఖ విద్య :** మానవాళి మనుగడకు జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, ప్రముఖ ఉపన్యాసకులు గొట్టేటి రవి అన్నారు. టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ శిక్షణలో భాగంగా బుధవారం క్వీన్ మేరీ ప్రైభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు ప్రకృతి పరిరక్షణ, దాని వినియోగం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ శిక్షణార్థులతో ప్రదర్శన నిర్వహించారు. కాకినాడకు చెందిన పర్యావర్యణ కార్యకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డోల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### నేడు రెండో విడత చందన సమర్పణ

**అనకాపల్లి:** గవరపాలెం దిబ్బవీధి వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రెండో విడత చందన సమర్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీలక్ష్మి, ఆండాళ్ అమ్మవార్లకు పంచామృతాభిషేకం, పట్టుచీర అలంకరణ, 7 గంటలకు స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం 7 గంటలకు దీపాలంకరణ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.